క్లుప్తంగా

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కొయ్యూరు: ఏపీజీవీబీ ఖాతాదారులు విధిగా బీమా సౌకర్యం కలిగి ఉండాలని బ్యాంకు ప్రాంతీయ మేనేజర్(ఆర్ఎం) సురేష్‌బాబు చెప్పారు. మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకును ఆయన బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఖాతాదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో తరచూ నెట్‌వర్క్‌కు అంతరాయం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు సమస్యను తెలియజేశారు. ఆయన స్పందించి త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ఈ సందర్భంగా బీమా వల్ల కలిగే ప్రయోజనాలను ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఖాతాదారుడు బీమా చేయించుకోవాలని సూచించారు. బిజినెస్ మేనేజర్ మోహన్‌దాస్, బీఎం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



కుర్చీ పోటీల్లో విద్యార్థులు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు కుర్చీలాట నిర్వహించినట్టు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించి, సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోరుకు మరమ్మతులు



ధర్మవరంలో పాడైన బోరుకు మరమ్మతు చేస్తున్న మెకానిక్

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ ధర్మవరంలో పాడైన బోరుకు ఎంపీటీసీ బిడిజన అప్పారావు ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. బోర్ పాడైందని, నీరు రావడం లేదని స్థానికులు బుధవారం ఎంపీటీసీ అప్పారావుకు తెలిపారు. ఆయన తక్షణమే స్పందించి, ఎంపీడీవో కార్యాలయానికి సమాచారం అందజేయగా, బోరు మరమ్మతులు చేశారు. పాడైన వెంటనే మరమ్మతు చేయించినందుకు ఎంపీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పరామర్శ



గాయపడిన ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మను పరామర్శిస్తున్న నాయకులు

గూడెంకొత్తవీధి: రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మను బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్‌లు రామకృష్ణ, గోపాల్, అంజి తదితరులున్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



నిట్టమామిడి గ్రామంలో ఏర్పాటుచేసిన ట్యాంకులను పరిశీలిస్తున్న ఏఈ విజయ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ మారుమూల నిట్టమామిడి గ్రామంలో గురువారం జల్‌జీవన్ మిషన్ పథకం కింద తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి ఐదు కిలోమీటర్లు కొండలు గుట్టలు కాలినడకన వెళ్లి, సింథటిక్ ట్యాంకులు, పైపులను కూలీలలతో తరలించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో గ్రావిటీ ద్వారా 5000 లీటర్ల రెండు నీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేసి గ్రామంలో 30 కుళాయిలను ప్రారంభించి తాగునీరు అందించినట్టు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆదివాసీ గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామీణ రహదారులకు మోక్షం



అభివృద్ధికి నోచుకోని కాగువలస- మొర్రిగూడ రహదారి



కాగువలస- మొర్రిగూడ రహదారి పనులు

అరకులోయ రూరల్: గ్రామస్తుల ఏళ్ల నాటి కల సాకారమైంది. దశాబ్దాలుగా చిత్తడి దారితో సతమతమైన గ్రామాలు నేడు అద్దంలా రహదారులతో అందంగా దర్శనమిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన్య ప్రాంతాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా శివారు గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోంది. ఫలితంగా మన్యం అభివృద్ధి పథం వైపు పయనిస్తోంది.

ఏళ్లనాటి కల సాకారమైన వేళ

మండలంలోని బస్కి పంచాయతీ శివారు గ్రామాలైన మొర్రిగూడ, గైబంద, పూసాలి గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరబోతుంది. మొర్రిగూడ రహదారికి మోక్షం కలిగింది. గత టీడీపీ హయాంలో కాగువలస నుంచి మొర్రిగూడకు సరైన రహదారి లేక స్థానికులు నానా అవస్థలు పడ్డారు. రవాణా సౌకర్యం లేక రైతులు కాలినడకనే వివిధ ప్రాంతాలు, వారపు సంతలకు రాకపోకలు సాగించేవారు. పాలకులు, అధికారులకు గ్రామస్తులు పలుమార్లు వినతులు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్యంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. బస్కి పంచాయతీ సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్నలు ఈ ప్రాంత రహదారి కోసం ప్రత్యేకంగా కృషి చేశారు. రోడ్డు సమస్యను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఫలితంగా కాగువలస నుంచి మొర్రిగూడ వరకు ఏడు కిలోమీటర్ల రహదారికి రూ.80.50లక్షలు మంజూరు చేసింది. దీంతో కాగువలస- మొర్రిగూడ రహదారికి మోక్షం కలిగింది. ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పాల్గుణ, సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీ రామన్నలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఏళ్ల నాటి రహదారి సమస్య పరిష్కారం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడు మండలాల గ్రామలకు కనెక్టివిటీ

మొర్రిగూడ రహదారి పూర్తి అయితే డుంబ్రిగూడ, హుకుంపేట, అనంతగిరి మండలాల పరిధిలో ఉన్న వివిధ గ్రామలకు కనెక్టివిటీ రహదారి సౌకర్యం కలుగుతుంది. కాగువలస–మొర్రిగూడ రోడ్డు వల్ల డుంబ్రిగూడ మండలం కితలంగి, ఈ దారి మీదుగా హుకుంపేట గత్తుం అటు నుంచి అనంతగిరి మండలం పట్టం గ్రామాలకు రహదారి అందుబాటులోకి వస్తోంది. దీంతో ఆయా గ్రామస్తులకు రవాణా సౌకర్యం కలుగుతుంది.

రుణపడి ఉంటాం



మా గ్రామానికి రోడ్డు దశాబ్దాల కలను సీఎం జగనన్న సాకారం చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషి ఎనలేనిది. మా ప్రాంత ప్రజలందరూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పాల్గుణకు రుణపడి ఉంటాం. జగనన్నకు గిరిజనులంతా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

–రామన్న, మొర్రిగూడ , బస్కి పంచాయతీ

ఆనందంగా ఉంది



కొన్నేళ్లుగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇందుకోసం ప్రయత్నించిన నాయకులు, స్పందించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇచ్చిన మాటకు కట్టుబడి నాయకులు రోడ్డు సౌకర్యం కల్పించం హర్షణీయం.

–దొసుధ, గాయిబంధ, బస్కి పంచాయతీ

రోడ్డు పనులు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో గ్రామాల్లో జరుగుతున్న రహదారి పనులు వేగవంతం చేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగానే నాణ్యతతో పనులు చేపడుతున్నాం. పనుల్లో ఎటువంటి లోపాలు ఉన్న సంబంధిత వారిపై శాఖా పరమైన చర్యలకు బాధ్యులు చేస్తాం. త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.

–సూర్యనారాయణ పడాల్, పంచాయతీ రాజ్ డీఈ, అరకులోయ

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న అనంతగిరి ఎంపీడీవో కుమార్



ఇందుకూరుపేట హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

అనంతగిరి: మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీ కాంగుపుట్టు, బల్లిమామిడి, దిగువసోనభ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను ఎంపీడీవో కుమార్ బుధవారం పరిశీలించారు. అనంతరం రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, హెచ్ఎం, పాఠశాల కమిటీ సభ్యులకు ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈవో వై.మల్లేశ్వరరావు బుధవారం పరిశీలించారు. పాఠశాలలో నాడు- నేడు పథకంలో నిర్మాణం పూర్తయిన వంటగది, మరుగుదొడ్లు తదితర పనులను పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని హెచ్ఎంకు సూచించారు. అనంతరం భవిత సెంటర్లో చదువుతున్న పిల్లలకు హియరింగ్ పరికరాలు, రోలేటర్స్ పంపిణీ చేశారు.

నేడు ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన

దేవీపట్నం: మండలంలోని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గురువారం మండలంలో పర్యటించనున్నట్టు ఎంపీపీ కుంజం మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే వలంటీర్లకు సన్మానం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పాముగండిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

పశువులకు టీకాలు



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

చింతపల్లి: మన్యంలో పశువులకు సోకిన లంపిస్కిన్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ ఏడి చంద్రశేఖరరావు తెలిపారు. పలు గ్రామాల్లో పశువుల ఆస్పత్రి వద్ద పశువులకు టీకాలు వేశారు. పలు పశువులకు ఈ వ్యాధి ప్రాణసంకటంగా తయారైందని, వ్యాధితో పాటు ఇతర రుగ్మతలకు సైతం వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. పశువులు వ్యాధులకు గురైతే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పశు సంచార సిబ్బంది కృష్ణ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న మల్లేష్, తదితరులు

కొయ్యూరు: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే అనారోగ్యం దరిచేరదని అల్లూరి యువ గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు టి.మల్లేష్ అన్నారు. చిట్టింపాడు పంచాయతీలో లింగాపురంలో సంఘం సభ్యులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంఘం అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మరగబెట్టిన నీటిని తాగాలని, దోమతెరలు వినియోగించాలని, నిల్వ ఆహారం తీసుకొవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎలాంటి అత్యవసరమైనా సాయం కావాలన్నా సంస్థ తరఫున సేవలందిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్తమ విద్య అభ్యసించిన యువకులను సన్మానించారు. యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. సంఘం కోశాధికారి చిట్టయ్య, నాయకులు గాంధీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్: రాజుపాలెం శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో బుధవారం సామూహిక విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, రుత్విక్‌వరణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు డి.కల్యాణ్‌కుమార్ ఆచారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయని ఆలయ చైర్మన్ బాబూరావు తెలిపారు.

దొంగ హామీలతో టీడీపీ మోసం



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, నేతలు

కొయ్యూరు: ప్రజల నోట్లో మట్టి కొట్టేందుకు, మోసం చేసేందుకు టీడీపీ దొంగ హామీలను గుప్పిస్తోందని ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు ఆరోపించారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి పేదలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని ప్రవేశపెట్టలేకపోయారని విమర్శించారు. గతంలో ప్రజలకు టీడీపీ ఇచ్చిన 600 హామీలు గుర్తు లేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు దొంగ హామీలతో ముందుకు వస్తున్న టీడీపీని నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇప్పటివరకు ఎనిమిది వేలకు పైగా గడపలను పర్యటించి, ప్రజలతో మమేకమై, అనేక సమస్యలను పరిష్కరించారన్నారు. కాగా టీడీపీ ఎమ్మెల్యేలు ఏనాడైనా ప్రజల వద్దకు వెళ్లే ధైర్యం చేయలేదని విమర్శించారు.

ఘనంగా వరమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

పాయకరావుపేట : చిట్టూరి మెట్రోలో వేంచేసిన శ్రీ వరమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం, నిత్యోపాసన, శ్రీ వరమహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ స్వామి వార్షిక కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి



రోలుగుంటలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో శారదా నది ఒడ్డున పాండవుల మెట్టపై వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్టాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. శ్రీ కవిత అగ్రి ఫారమ్స్ అధినేత డి.వి. అప్పారావు సౌజన్యంతో శ్రీ భూవరహా, జయ, విజయ, శ్రీచక్ర మేరువు, గరుడ, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. వేలాదిగా భక్తులు రావడంతో పాండవుల మెట్ట కిక్కిరిసింది. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

దేవరాపల్లి: మండలంలోని ఏ. కొత్తపల్లిలో గరగమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారజాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరగమాంబ అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధనను నిర్వహించారు.

మాకవరపాలెం: శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బుధవారం ఘనంగా ప్రతిష్ఠించారు. కనకదుర్గమ్మ ఆలయాన్ని నిర్మించిన రుత్తల చింతల్లి తన సొంత సొమ్ముతో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

చోడవరం: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మండలంలో లక్కవరం, అంబేరుపురం గ్రామాల్లో పండగ వాతావరణం ఏర్పడింది. లక్కవరంలో మోదకొండమ్మతల్లి, అంబేరుపురంలో లక్ష్మమ్మ అమ్మవారి ఆలయాలు కొత్తగా నిర్మించారు. ఆయా ఆలయాల్లో బుధవారం విగ్రహ ప్రతిష్ట, కలశప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు



సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో బాపన్నదొర సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ కలిపి 5 వేల మందికి తగ్గకుండా ఉపాధి పనుల్లో పాల్గొనేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల ప్రకారం ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్, బయోమెట్రిక్, బ్యాంక్ అకౌంట్‌లు సరిచేయాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉద్యాన మొక్కల పెంపకానికి 500 ఎకరాల్లో లక్ష్యాలకనుగుణంగా రైతులను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు వేయాలని సూచించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఉపాధి హామీ విభాగానికి అనుసంధానం అయిన నేపథ్యంలో ఆయా గృహాల వద్ద జరుగుతున్న పనులకు మస్తర్ల నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. వేటమామిడి సచివాలయంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, ఎంపీడీవో కె.బాపన్నదొర సచివాలయ సిబ్బందికి బుధవారం సమావేశం నిర్వహిచారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ రాఘవ చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులకు వ్యవసాయ రుణాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న హస్తినకుమార్

అరకులోయ రూరల్: అర్హులైన రైతులకు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్(శ్రీను) కోరారు. మండలంలో సుంకరమెట్ట పంచాయతీ దాబుగూడ, సంగంవలస గ్రామాల్లో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న రుణాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పీఏసీఎస్ బ్యాంక్‌లో సభ్యత్వం పొందిన 1899 మంది రైతులకు రూ.50 లక్షల రుణాలు అందించామన్నారు. పట్టాదారు రైతులు ఉంటే సభ్యత్వం పొంది వ్యవసాయ రుణాలు పొందాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బురిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ లలితకుమారి తదితరులు

మారేడుమిల్లి: గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ సార్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని సున్నంపాడు పంచాయతీ నూరుపూడి గ్రామంలో రూ 19 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు ఆమె పార్టీ నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ట్యాంక్ నిర్మాణం త్వరగా చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, సున్నంపాడు సర్పంచ్ వెలుగురి చిన్న లచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మడకం అనిల్ కుమార్ ,నాయకులు సార్ల లింగారెడ్డి, మడకం రామన్న దొర గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



దామనాపల్లి ఆర్‌బీకే వద్ద విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం తొంబై శాతం రాయితీపై గిరి రైతులకు పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని దామనాపల్లి పంచాయతీ సర్పంచ్ రామకృష్ణ అన్నారు. దామనాపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై విత్తనాలను ఆయన బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో రైతులు మండల కేంద్రాలకు వచ్చి అనేక వ్యయ ప్రయాసాలకు లోనై విత్తనాల కోసం పడిగాపులు కాసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి సీజనుకు ముందుగానే విత్తనాలను రైతులకు అందిస్తోందన్నారు. వ్యవసాయ సిబ్బంది జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి



జాజిగడ్డలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు దీప

వై.రామవరం: గ్రామాల్లో ఏ సమస్యలున్నా శాంతియుతంగా గ్రామ పెద్దల ద్వారా పరిష్కరించుకోవాలని స్థానిక గ్రామ సచివాలయ మహిళా పోలీసు పొడియం దీప అన్నారు. సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు వై.రామవరం సచివాలయం పరిధిలోని జాజిగడ్డ గ్రామంలో దీప ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏసమస్య ఉన్నా గ్రామంలో పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో తన దృష్టికి తీసుకోస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరించొద్దన్నారు. గంజాయి రవాణా, సాగు, సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు. అనారోగ్యానికి గురైతే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలని, నాటు వైద్యానికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళా చట్టాలు, దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ వలంటీర్ వెలుగూరి బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వల్లభనారాయణుడి కల్యాణం

రాంబిల్లి : మండంలోని దిమిలి గ్రామంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు.

స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. దేవస్థానంలో ముందుగా వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు తప్పనిసరిగా పంచె, కండువా ధరించాలని సూచించారు.